# రోడ్డున్నా.. బస్సు రాదాయె..

- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- మహాలక్ష్మి పథకానికి మహిళలు దూరం

కుంటాల, జనవరి 21 : రహదారి సౌకర్యం ఉన్న మండలంలోని పెంచికల్‌పాడ్, విట్టాపూర్ తదితర మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సు సేవలు ప్రజలకు అందడం లేదు. ఈ గ్రామాలకు తారు రోడ్డు సౌకర్యం ఉన్నా ఆర్టీసీ అధికారులు బస్సులు నడపకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలు, కళాశాలలకు సమయానికి చేరుకోలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు నడపాలని పలుసార్లు స్థానిక ప్రజా ప్రతినిధులు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో తిమ్మాపూర్ ఎన్‌హెచ్ నుంచి పెంచికల్‌పాడ్, విట్టాపూర్‌కు బస్సు నడిపినా రద్దీ ఉండడం లేదని నిలిపివేశారు.మహాలక్ష్మి పథకం నేపథ్యంలో తమ గ్రామాలకు కూడా బస్సులు నడపాలని మహిళలు కోరుతున్నారు. ప్రస్తుతం ఓలా నుంచి మెదన్‌పూర్ వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జ్ పునర్నిర్మాణం దశలో ఉండడంతో బస్సు సర్వీసును తాత్కాలికంగా నిలిపివేశారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన వెంటనే బస్సు సర్వీసు పునప్రారంభించాలని మెదన్‌పూర్ గ్రామస్తులు కోరుతున్నారు.

**నెల కిరాయి చెల్లిస్తూ..**

నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు ప్రైవేటు వాహనాల్లో కల్లూర్, తిమ్మాపూర్, భైంసాలలోని పాఠశాల, కాలేజీలకు వెళ్తుంటారు. ప్రాథమికోన్నత, ఉన్నత, ఇంటర్మీడియట్ విద్య కోసం ఇతర గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఆర్థిక స్తోమత ఉన్న తల్లిదండ్రులు విద్యార్థులకు సైకిళ్లు, ప్రైవేటు వాహనాలకు నెల అద్దె చెల్లిస్తూ పంపిస్తున్నారు.

**బస్ సౌకర్యం కల్పించాలి..**

**- కిష్టయ్య ఉప సర్పంచ్(పెంచికల్‌పాడ్)**



గతంలో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి కృషితో ఆర్టీసీ కొన్ని రోజులు బస్ సర్వీసును నడిపించారు. కానీ కొన్ని రోజులకే మళ్లీ రద్దయింది. పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించాం. బడికి వెళ్లే విద్యార్థులు రోజు సమయానికి చేరుకోవడానికి కష్టంగా ఉంది. మా గ్రామాలకు బస్సులు పునః ప్రారంభించాలి.

## వైద్యాధికారి పోస్టు భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 21 : నిర్మల్ జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో బస్తీ దవాఖానలో పనిచేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ తెలిపారు. భైంసాలోని బస్తీ దవాఖానలో వైద్యాధికారి(1) పోస్టు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వైద్యాధికారి పోస్టుకు ఎంబీబీఎస్ అర్హత కలిగి తెలంగాణ మెడికల్ బోర్డు రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న వారు ఈనెల 22 నుంచి 25 వరకు జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ అర్బన్, జనవరి 21 : నిర్మల్‌లోని చించోలి (బీ) నందు గల మైనార్టీ గురుకుల (బాలుర) పాఠశాల, కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మొకిరాల మహేశ్ తెలిపారు. వచ్చే నెల 6వ తేదీ వరకు చివరి తేదీ అని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఐదో తరగతిలో 80 సీట్లు ఉండగా.. మైనార్టీలకు 60, నాన్ మైనార్టీలకు 20 సీట్లు కేటాయించారని తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు 40 సీట్ల చొప్పున మొత్తం 80 సీట్లు ఉన్నాయని 60 మైనార్టీలకు, 20 నాన్ మైనార్టీలకు కేటాయిస్తామని, మైనార్టీలకు దరఖాస్తు చేసుకున్న క్రమ సంఖ్య ఆదారంగా, నాన్ మైనార్టీలకు లక్కీడీప్ ద్వారా సీట్లను కేటాయిస్తామని తెలిపారు. 6, 7, 8 తరగతుల్లో బ్యాక్ లాగ్ సీట్లను భర్తీ చేస్తామని, మరిన్ని వివరాలకు 9000531993, 934714 274, 7995057957 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# ఎమ్మెల్యే పరామర్శ

దిలావర్‌పూర్ జనవరి 21: మండలంలోని లోలం, గుండంపల్లి గ్రామాల్లో పలువురిని ఆదివారం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అంతకు ముందు లోలం గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ వెంకటేశ్ అనారోగ్యంతో దవాఖానలో చేరి ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలు సుకున్నారు. అదే గ్రామానికి చెందిన పెంట భూమయ్య తల్లి ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని, గుండంపల్లి గ్రామానికి అల్లూరి పెద్ద నారాయణరెడ్డి ఇటీవల మరణించగా ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని బాధిత కుటుంబాలకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, డీ ముత్యంరెడ్డి, వీరేశ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు రామాగౌడ్, కన్న సాయన్న, మంద మల్లేశ్, పెంట భూమయ్య, సత్యం చంద్రకాంత్, తక్కల కిషన్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, కే చిన్నయ్య, కరుణాకర్, దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

**పాక్‌పట్లలో..**

సోన్, జనవరి 21 : సోన్ మండలంలోని పాక్‌పట్ల గ్రామానికి చెందిన పట్టెపురం నర్సవ్వ, తల్వేద ముత్యం, తోట లింగన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. కుటుంబసభ్యుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్న ఆయన ధైర్యంగా ఉండాలని సూచించారు. నాయకులు మార గంగారెడ్డి, సరికెల గంగన్న, ముత్యంరెడ్డి, రమణారెడ్డి, జమాల్, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది నిర్లక్ష్యం

పెంబి, జనవరి 21 : పెంబి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించడం లేదని రోగులు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం అక్కోనిమాడ గ్రామానికి చెందిన గిరిజన మహిళ ప్రసవించింది. ఆదివారం పీహెచ్‌సీలో కనీసం స్టాఫ్‌నర్స్ కూడా విధుల్లో లేరని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు మంచికంటి లక్ష్మణ్ ఆరోపించారు. ఆదివారం ఆయన బాలింతను పరామర్శించారు. పెంబి పీహెచ్‌సీలో ఎక్కువగా గిరిజనులే వైద్యం చేయించుకుంటారని, వైద్య సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కాగా దీనిపై ఇన్‌చార్జి వైద్యాధికారి శివ కుమార్ వివరణ కోరగా తమ సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. శనివారం పెంబి పీహెచ్‌సీలో ఇద్దరు మహిళలు ప్రసవించారని, తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని తెలిపారు.

## పరామర్శ

సోన్, జనవరి 21 : పాక్‌పట్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తోట లింగన్న ఇటీవల మృతి చెందగా ఆదివారం బీఆర్‌ఎస్ మాజీ కార్యదర్శి వీ సత్యనారాయణగౌడ్ వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. నల్ల నర్సవ్వ, తల్వేద ముత్యం ఇటీవల మృతి చెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్‌చల్ గంగారెడ్డి, మోహినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరుకాపు సంఘం కార్యవర్గం



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

భైంసా, జనవరి 21 : భైంసాలోని కాలనీ మున్నూరుకాపు సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లంక గంగాధర్, ఉపాధ్యక్షులుగా పసల లక్ష్మణ్, కార్యదర్శిగా బోయిడి రవి, సహాయ కార్యదర్శిగా ఇందూర్ సంజీవ్, కోశాధికారిగా లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులను సత్కరించారు.

# అల్ఫోర్స్‌లో శ్రీరామ ఆకృతిలో విద్యార్థులు

భైంసా, జనవరి 21 : భైంసాలోని అల్ఫోర్స్ పాఠశాలలో అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు శ్రీరామ ఆకృతిలో కూర్చున్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ డా. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అయోధ్య రామమందిరం హిందువుల చిరకాల స్వప్నమని, ధర్మరక్షణకు ఒక గొప్ప వేదిక అని అన్నారు. యావత్ భారతదేశ వ్యాప్తంగా గొప్ప వేడుక జరుపుకుంటున్నారని, పరోక్షంగా పాల్గొని పవిత్రమైన శ్రీరామనామ జపం చేయాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.




శ్రీరామ ఆకృతిలో విద్యార్థులు

## ముగిసిన క్రికెట్ పోటీలు

సారంగాపూర్, జనవరి 21 : మండలంలోని జామ్ గ్రామంలో క్రికెట్ ప్రిమియం లీగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో చరణ్, చింటు జట్లు తలపడ్డాయి. చింటు జట్టు మొదట బ్యాటింగ్ ఎంచుకొని ఎనిమిది ఓవర్స్‌లో 48 పరుగులు చేశారు. చరణ్ జట్టు లక్ష్యాన్ని చేధించి విన్నర్‌గా నిలిచింది. విన్నర్‌గా నిలిచిన చరణ్ జట్టుకు రూ. 10వేలు, రన్నర్‌గా నిలిచిన చింటు జట్టుకు రూ. 5 వేల నగదుతో పాటు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మహిపాల మురళీకృష్ణ, ఉప సర్పంచ్ కరిపె విలాస్, గ్రామస్తులు మహేశ్, సగ్గం రాజు, ప్రవీణ్‌గౌడ్, కండెల రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



ముథోల్ : ఓటు హక్కు దరఖాస్తును స్వీకరిస్తున్న అధికారులు



దస్తురాబాద్ : కర పత్రాలతో అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఐ గంగన్న

దస్తురాబాద్, జనవరి 21 : 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆర్‌ఐ గంగన్న సూచించారు. రెండో రోజు ఆదివారం పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జనవరి 1 తేదీ లోపు 18 ఏండ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఎల్వోలు, సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

**ముథోల్‌లో..**

ముథోల్, జనవరి 21 : ముథోల్‌తో పాటు ఆయా గ్రామాల్లో ఓటు హక్కు నమోదు కార్యక్రమం ముగిసిందని అధికారులు తెలిపారు. చివరి రోజు చాలా చోట్ల మండలంలోని గ్రామాల్లో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ఆయా గ్రామాల్లో ఓటు హక్కు వినియోగంపై స్థానిక సర్పంచ్‌లు అవగాహన కల్పించారు.

**ఓటరు నమోదు కేంద్రం పరిశీలన**

దిలావర్‌పూర్ జనవరి 21 : మండలంలోని న్యూ లోలం, కాల్వ గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ఆదివారం ఆర్‌ఐ సంతోష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని బీఎల్‌వోస్ ద్వారా ఓటరు నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామాల్లో యువత నుంచి స్పందన వచ్చిందన్నారు.

**సోన్‌లో..**

సోన్, జనవరి 21 : రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ముగిసినట్లు తహసీల్దార్లు శివరాజ్, సంతోష్ తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారందరికీ కొత్తగా ఓటరు నమోదు కార్యక్రమంతో పాటు మార్పులు, చేర్పులకు రెండు రోజుల పాటు స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించామని తెలిపారు.

# నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఖానాపూర్, జనవరి 21 : అయోధ్యలో శ్రీబాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన నేపథ్యంలో ఖానాపూర్‌లోని శ్రీరాంనగర్ కాలనీలోని అతి పురాతనమైన రామాలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి పూజల్లో పాల్గొనాలని కోరారు. శాంతి నగర్, విద్యానగర్ కాలనీల్లో అయోధ్య రాములవారి అంక్షింతలను నాయకులు ఇంటింటికీ అందజేశారు. అల్లాడి వెంకటేశ్వర్లు, గోపాల్ రెడ్డి, సత్యనారాయణ, రవి పాల్గొన్నారు.



ఖానాపూర్ : శాంతినగర్‌లో ఇంటింటికీ రాముల వారి అంక్షింతలు అందజేస్తున్న నాయకులు

**నిర్మల్‌లో..**

నిర్మల్ అర్బన్, జనవరి 21 : నిర్మల్‌లోని పలు ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు.స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని రామాలయం, హనుమాన్ ఆలయం, బాగులవాడ వాల్మీకి ఆలయంతో పాటు హనుమాన్ ఆలయాలను ఆలయ కమిటీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. శాంతినగర్ హనుమాన్ ఆలయం, హౌసింగ్ బోర్డు కాలనీలోని రామాలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని తెలిపారు.

**కుంటాలలో..**

కుంటాల, జనవరి 21 : కుంటాలలోని శ్రీరామకృష్ణ వీరబ్రహ్మేంద్ర స్వామి మందిరంలో సోమవారం శ్రీరాముల వారి పూజ, సామూహిక రామ భజన, హనుమాన్ చాలీసా పారాయణం, ఉంటుందని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వారు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ముందు శ్రీ ఉమామహేశ్వర ఆలయం నుంచి బైక్ ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు.



ఖానాపూర్‌రూరల్ : మస్కాపూర్‌లో మంగళ హారతులతో పూజలు చేస్తున్న మహిళలు

**మస్కాపూర్‌లో..**

ఖానాపూర్ రూరల్, జనవరి 21 : మస్కాపూర్ గ్రామంలోని శ్రీరామాలయంలో శివాజీనగర్‌కు చెందిన వనితర శక్తి సభ్యుల ఆధ్వర్యంలో మన అమ్మకు మన సారే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజాలు చేశారు. ఆలయంలో కానుకలను అమ్మవారికి అందజేశారు. పద్మ, భార్గవి, రజిత, స్వరూప, శ్రీలత, సుమ, వనజ, తదితరులు పాల్గొన్నారు.

**ముథోల్‌లో..**

ముథోల్, జనవరి 21 : ముథోల్‌లో నేడు రాములోరి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శోభాయాత్ర అనంతరం స్థానిక రామమందిరంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

## లెనిన్ శత వర్ధంతి

నిర్మల్ టౌన్, జనవరి 21 : లెనిన్ స్ఫూర్తితో జిల్లాలో ఉద్యమాలు నిర్వహిద్దామని సీపీఎం నాయ కులు పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో లెనిన్ శత వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేద ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని నాయకులు పేర్కొన్నారు. అడివయ్య, గౌతం, ఫసియొద్దీన్, భీంరావు పాల్గొన్నారు.




లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



మందపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు, నాయకులు

## వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

పెంబి, జనవరి 21 : మండలంలో మందపల్లి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ పథ కాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ జిల్లా కో కన్వీనర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చూస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఆయూష్మాన్ భారత్, పీఎంజేజేబీవై, పీఎం ఎస్‌బీబై, అటల్ పెన్షన్ యోజన పథకాల్లో చేరి లబ్ధి పొందాలని సూచించారు. ఇండియన్ గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఇండియన్ గ్యాస్ నిర్వాహకులు జూనీకుమార్, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## సమాజ చైతన్యంలో కవుల పాత్ర కీలకం

నిర్మల్ టౌన్, జనవరి 21 : సమాజాన్ని చైతన్యం పర్చడంలో కవులు రచయిత్రల పాత్ర ఎంతో కీలకమని కలం స్నేహం వ్యవస్థాపక అధ్యక్షుడు గోపాల్ ఆచార్య, నిర్మల్ నిర్వాహకులు కడారి దశరథ్ పేర్కొన్నారు. నిర్మల్‌లోని పీఆర్టీయూ భవనంలో ఆదివారం కవి సమ్మేళానాన్ని నిర్వహించారు. ఈ సమ్మేళానికి నిర్మల్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కవులు, కళాకారులు, రచయితలు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో సమాజ చైతన్యం కోసం కవులు ముందుకురావాలని కోరారు. రాముని విశిష్టతను తెలుపుతూ కవి సమ్మేళాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు దేవి ప్రియ, కవులు శోభారాణి, శంకర్, తొడిశెట్టి రవికాంత్, వాణిశ్రీ, పోలీసు భీమేశ్, జ్ఞానేశ్వర్, జనార్ధన్, సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న కవులు, కళాకారులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

భైంసాటౌన్, జనవరి 21 : మండలంలోని తిమ్మాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 2005-06లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన గురువులను పూలమాల, శాలువాతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలు, ఉపాధి మార్గాలపై చర్చించుకున్నారు. గత స్మృతులను గుర్తు చేసుకొని రోజంతా ఉత్సాహంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు.

## చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

నిర్మల్ టౌన్, జనవరి 21 : బీసీ కుల గణన కోసం ఫిబ్రవరి 7 నుంచి రెండు రోజుల పాటు ఢిల్లీలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఉమ్మడి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజులదేవి శ్రీనివాస్ కోరారు. నిర్మల్‌లో జిల్లా కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. బీసీ కుల గణనను చేపట్టాలని నర్సాగౌడ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఢిల్లీకి బీసీలంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శివకుమార్, రాములు, సదానంద్, తదితరులు పాల్గొన్నారు.

## 24లోగా దరఖాస్తులు చేసుకోవాలి

ఎదులాపురం, జనవరి 21 : ఉమ్మడి జిల్లాలో డిగ్రీ పాసైన అభ్యర్థులు గ్రూప్ 1,2,3,4 ఫౌండేషన్ కోర్సుల ఉచిత కోచింగ్‌కు ఈ నెల 24 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీబీసీడీవో కే రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. గతంలో శిక్షణ తీసుకున్న అభ్యర్థులు దరఖాస్తు చేయవద్దన్నారు. అభ్యర్థుల ఆదాయ ధ్రువీకరణ పత్రం రూ.5లక్షల లోపు ఉండాలన్నారు. అభ్యర్థుల ఎంపిక విధానం రిజర్వేషన్, డిగ్రీ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివరాల కోసం 08732 221280 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

నిర్మల్ టౌన్, జనవరి 21 : తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసి దివ్యాంగుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కార్యదర్శి అడివయ్య పేర్కొన్నారు. నిర్మల్‌లోని సీపీఎం కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీనిచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం వాటిని వెంటనే భర్తీ చేయాలని తెలిపారు. దివ్యాంగులకు పెన్షన్‌ను పెంచాలని, దివ్యాంగుల చట్టాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గౌరవ అధ్యక్షుడు శంభు, నాయకులు ముత్తజ్‌బేగం, రాజేశ్వర్, సత్యనారాయణ, రాజేశ్వర్, గోపి, రత్నకర్, జయంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న అడివయ్య

## దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలి

నిర్మల్ టౌన్, జనవరి 21 : దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆదర్శ దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్ పేర్కొన్నారు. ఆదివారం నిర్మల్‌లోని రెడ్డి ఫంక్షన్ హాలులో నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులకు పెన్షన్‌ను అందించాలని కోరారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా ముత్యం, ప్రధాన కార్యదర్శిగా గుమిడ్యాల గంగాధర్, సిద్దుల చిన్నయ్య, మహిళా అధ్యక్షురాలిగా సింగిరెడ్డి విజయ, సహాయ కార్యదర్శిగా గంగన్న, భూమేశ్‌ను ఎన్నుకున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319418-All

EDUCATION

★Admissions: రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, M.Tech, D-Pharma, B.Pharma, B.Sc. (Agri.), B.Sc. (Nursing), B.Ed, B.Ped, MBA, MCA. Eligible for all Jobs. Ph: 8866977112, 339.
NT-319803-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677